# ‘ప్రజాపాలన’ పకడ్బందీగా చేపట్టాలి



రేజింతల్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- రేజింతల్‌లో దరఖాస్తుల స్వీకరణ పరిశీలన

న్యాల్‌కల్, డిసెంబర్ 28 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనను పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని రేజింతల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామ సభను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభయహస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఐదు పథకాలైన మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇండ్లకోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పంచాయతీల వద్ద తాగునీరు, టెంట్లు, వైద్య క్యాంపు, క్యాలెన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను రికార్డులో వివరాలను నమోదు చేయాలన్నారు. గ్యారెంటీల దరఖాస్తులే కాకుండా ధరణి, రేషన్‌కార్డుతో ఇతర దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డీవో వెంకారెడ్డి, డివిజన్ పంచాయతీ అధికారి రాఘవరావు, తహసీల్దార్ భానుకిరణ్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏడీఈ రజినీకాంత్, అసిస్టెంట్ ఇంజినీర్ మహేశ్, వైద్యసిబ్బంది శ్యామల, సర్పంచ్ కుతుబోద్దీన్ ఎంపీటీసీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

**పైరవీలకు అవకాశం లేదు**

**-మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**

మెదక్ రూరల్, డిసెంబర్ 28 : ప్రజలకు సందేహాలుంటే అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని పాతూరు, రాయిన్‌పల్లి మక్తభూపతిపూర్, తిమ్మానగర్ గ్రామాల్లో ఎంపీడీవో శ్రీరాములు, తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ‘ప్రజాపాలన’ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాయిన్‌పల్లి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మిగిలిన ఐదు గ్యారెంటీల కోసం అర్హులను గుర్తించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పైరవీలకు అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సిద్దగౌడ్ లింగమ్మ, ఎంపీటీసీ శ్రీహరి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, ఎంపీవో ప్రశాంత్, పీఆర్ ఏఈ సల్మాన్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



రాయిన్‌పల్లిలో అధికారులకు సూచనలు చేస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



అనీల్‌కుమార్‌కు ఆశీస్సులు అందజేస్తున్న అర్చకులు

## కొమురవెల్లి ‘మల్లన్న’ కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

- రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ అనీల్‌కుమార్
- బ్రహ్మోత్సవాలపై సమీక్ష
- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి కొండా సురేఖ

చేర్యాల, డిసెంబర్ 28 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేస్తున్నామని దేవాదాయశాఖ రాష్ట్ర కమిషనర్ అనీల్‌కుమార్ తెలిపారు. గురువారం మల్లికార్జున స్వామి క్షేత్రంలో పర్యటించారు. మొదటగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం 50ధర్మాశాలల భవనం, రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద గుట్ట పైభాగంలో ఏర్పాటు చేస్తున్న త్రిశూలం, ఢమరుక నిర్మాణ పనులు, దాసారం గుట్ట వద్ద నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. తోటబావి వద్ద శాశ్వత కల్యాణవేదిక వద్ద చేపట్టిన కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. రూ.12కోట్లతో నిర్మిస్తున్న క్యూలైన్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బందోబస్తుపై సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సై నాగరాజుతో చర్చించారు. కల్యాణోత్సవానికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ హాజరై పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఈవో బాలాజీ, ఏఈవో వైరాగ్యం అంజయ్య, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రజల కోసం ‘ప్రజాపాలన’

**-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**



మెదక్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 28 : ప్రజల కోసం ప్రజాపాలన అందిస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 1వ వార్డులోని ఔరంగాబాద్‌లో గురువారం మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ జానకీరామ్‌సాగర్, కౌన్సిలర్ కిశోర్‌తో కలిసి ‘ప్రజాపాలన’ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలెవరూ ఇబ్బందులు పడొద్దని, ప్రజలకు ఇచ్చి ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తొలిరోజు 1వ వార్డుతో పాటు 2, 3, 4వ వార్డుల్లో కౌన్సిలర్లు వేదవతి, విశ్వం, నర్సద్దతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జయరాజ్ మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్, కోఆప్షన్ సభ్యుడు గంగాధర్ పాల్గొన్నారు.

## నెల రోజులు ఆపరేషన్ స్మైల్ -X

**హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ పద్మజ**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఇతర అధికారులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 28: రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 1వ తేదీ నుంచి 31వరకు ఆపరేషన్ స్మైల్–X కార్యక్రమం నిర్వహించనున్నట్లు హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ పద్మజ అన్నారు. గురువారం ఆపరేషన్ స్మైల్–X నిర్వహణ గురించి సిద్దిపేట జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏండ్ల లోపు బాల బాలికలు తప్పిపోయినా, వదిలేసినా, కార్మికులుగా ఉన్నా.. అలాంటి వారి సమాచారం సేకరించి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. బలవంతంగా భిక్షాటన చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సిద్దిపేట అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు) మల్లారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో డివిజన్ల వారీగా మూడు టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులతో పని చేయిస్తున్నా, వెట్టి చాకిరీ చేయిస్తున్నా.. వెంటనే ఎస్సైల నెంబర్లకు లేదా డయల్ 100, సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 67100కు సమాచారం అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే అభ్యర్థులు ఖర్చుల వివరాలు సమర్పించాలి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 28 : రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చుల వివరాలు జనవరి 2వ తేదీలోపు సమర్పించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సహాయ వ్యయ పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో సహాయ వ్యయ పర్యవేక్షణ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు రోజూ నిర్వహించిన అకౌంట్స్ రిజిస్టర్స్, క్యాష్ రిజిస్టర్స్, బ్యాంక్ రిజిస్టర్స్, సమగ్ర వివరాలను నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. సంబంధిత ఫారాలను నింపి.. ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎలక్షన్ ఎక్స్‌పెండీచర్ నోడల్ అధికారి సందీప్‌కుమార్, అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లు పాల్గొన్నారు.

### తల్లిదండ్రులపైనే విద్యార్థుల భవిష్యత్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 28: విద్యార్థుల భవిష్యత్ తల్లిదండ్రులపై ఆధారపడి ఉంటుందని మెదక్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సత్యనారాయణ అన్నారు. మెదక్ కలెక్టర్ ఆదేశాల మేరకు మెదక్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మైనార్టీ బాలికల గురుకుల జూనియర్ కళాశాలల్లో గురువారం పేరెంట్స్–టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా తల్లిదండ్రులు, అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు మహాలక్ష్మి, సురేశ్, అధ్యాపకులు వెంకటయ్య, వసంత్‌రావు, సుమన, మంజుల రాణి, సురేశ్‌బాబు, జ్యోతి పాల్గొన్నారు.

### జాతీయస్థాయి ఖోఖో పోటీలకు చౌటకూర్ విద్యార్థి



విద్యార్థి ఉదయ్‌చరణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చౌటకూర్, డిసెంబర్ 28 : చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్.ఉదయ్‌చరణ్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఝార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో త్వరలో జరుగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన ఉదయ్‌చరణ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, పీఈటీ కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

## పీఎఫ్ ఆర్డీఏను రద్దు చేయాలి

**-టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్**




ర్యాలీలో పాల్గొన్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఉద్యోగుల పాలిటశాపంగా మారిన పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ ఆర్డీఏ) చట్టాన్ని రద్దు చేయకుంటే పోరుబాట తప్పదని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ హెచ్చరించారు. అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో పీఎఫ్ ఆర్డీఏ, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురు, శుక్ర, శనివారాల్లో మూడురోజులపాటు కోల్‌కత్తాలోని సమీర్ భట్టాచార్య మంచ్‌లో నిర్వహించిన జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ వ్యవస్థ (సీపీఎస్ )ను రద్దు చేసి, పాత పెన్షన్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మినీకి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ పాషా పాల్గొన్నారు.

## ప్రవీణ్‌కు విద్యారత్న అవార్డు



హైదరాబాద్‌లో ఉత్తమ విద్యారత్న అవార్డు అందుకుంటున్న ప్రవీణ్ కుమార్

మునిపల్లి, డిసెంబర్ 28 : ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ సాహితీ కళా సేవ ప్రతిభా పురస్కారాలు 2023లో మండలంలోని మల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్‌ను వరించినట్లు మునిపల్లి ఎంఈవో దశరథ్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో సినీ, రాజకీయ ప్రముఖుల ఆధ్వర్యంలో ప్రవీణ్ కుమార్ ఉత్తమ విద్యారత్న పురస్కారాన్ని అందుకున్నట్లు చెప్పారు. ఉత్తమ విద్యారత్న పురస్కారాన్ని అందుకున్న ప్రవీణ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.